
క్రేన్ సాయంతో వినాయకుడిని గంగ ఒడికి చేర్చుతున్న దృశ్యం


విద్యుత్ కాంతులతో శోభాయమానంగా వినాయక ఘాట్



బై బై.. గణేశా

- నిమజ్జనోత్సవంలో యువత సందడి
- నగరంలో 2 వేలకు పైగా విగ్రహాలు నిమజ్జనం
- కోలాహలంగా సాగిన శోభాయాత్ర
- ముగిసిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు (కల్చరల్/న్యూసిటీ), సెప్టెంబరు 15: నగరంలో గణేశ్ నిమజ్జన వేడుకలు కన్నుల పండువగా సాగాయి. తొమ్మిది రోజులుగా మండపాల్లో పూజలు అందుకున్న వినాయకుడు ఆదివారం నిమజ్జనానికి తరలివెళ్లారు. ఉత్సవాల్లో యువత, పిల్లలు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. ఈ ఏడాది ఐదు అడుగుల నుంచి ఇరవై అడుగుల వరకు వినాయక ప్రతిమలు ఏర్పాటు చేశారు. వివిధ వేషధారణలు ధరించి భక్తులను ఆకట్టుకున్నారు. బాణసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ, డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో ఊరేగింపుగా వినాయక ఘాట్‌కు వెళ్లారు. 'గణపతి బొప్పా మోరియా' అనే నినాదాలు చేశారు. పాతనగరం నుంచి వినాయక ఘాట్ వరకు, అటు నంద్యాల చెక్‌పోస్టు, ఇటు బళ్లారి చౌరస్తా, మరోవైపు కల్లూరు చెన్నమ్మ సర్కిల్ నుంచి నాలుగు చోట్ల నుంచి ఘాట్ వరకు రహదారులన్నీ జనంతో కిటకిటలాడాయి. నగరంలోని ప్రధాన రహదారుల్లోని దుకాణాలను నిర్వాహకులు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆదివారం సెలవు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ఉద్యోగులు, యువత నిమజ్జనాన్ని వీక్షించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు.

సిరి సంపదలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి : మంత్రి భరత్

సిరి సంపదలతో జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండేలా చూడాలని గణనాథుడిని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వేడుకున్నారు. ఉదయం రాంబొట్ల దేవాలయం వద్ద వివేకానంద యువజన సంఘం ఏర్పాటు చేసిన తొలి నిమజ్జన గణపతి విగ్రహాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, పాణ్యం, కోడుమూరు. ఆదోని ఎమ్మెల్యేలు గౌరు చరితారెడ్డి, బొగ్గుల దస్తగిరి, పార్థసారథి, జేసీ బి.నవ్య, ఎస్పీ బింధుమాదవ్, నగర మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, ఎస్వీ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలం పాటలో నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి రూ.2.35లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం రాంబొట్ల దేవాలయం ప్రాంగణంలో కర్నూలు మరాఠా సేవాసంఘ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని మంత్రి, ఎస్పీ, జేసీ ఇతర ప్రజా ప్రతినిధులు నిమజ్జనం చేశారు.


నిమజ్జనానికి వెళ్తున్న గణనాథులు


నీటిలో మునిగిపోతున్న విగ్రహం


యువతుల కేరింతలు


డ్యాన్స్ చేస్తున్న యువతులు


డ్రమ్స్ కొడుతున్న యువతీ యువకులు


వినాయక ఘాట్ వద్ద నిమజ్జన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు


ఊరేగింపులో పాల్గొన్న ప్రజాప్రతినిధులు


నిమజ్జనాన్ని వీక్షిస్తున్న భక్తులు

నేడు మిలాద్ ఉన్ నబీ

ముస్తాబైన మసీదులు



కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: ముస్లింలకు అత్యంత పవిత్రమైన ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీ పర్వదిన వేడుకలు సోమవారం వైభవంగా జరగనున్నాయి. ఇందు కోసం పట్టణాలు, పల్లెల్లోని మసీదులు, దర్గాలు సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ సందర్భంగా ముస్లింలు ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలు, మత పెద్దల బోధనల కోసం ఏర్పాట్లు చేశారు.

మిలాద్ ఉన్ నబీ విశిష్టత

మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్నే కొన్ని ముస్లిం తెగలు ఈద్-ఏ-మిలాద్-ఉన్-నబీగా జరుపుకుంటారు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం మూడో నెల రబీ అల్-అవ్వల్ 12వ రోజున ముస్లింలు ఈ పర్వదినాన్ని గుర్తించి వేడుకలు నిర్వహిస్తారు. ఈ ఏడాది సెప్టెంబరు 15 సాయంత్రం నుంచి ప్రారంభం కాగా సోమవారం సాయంత్రం ముగుస్తుంది. దీంతో జిల్లా వ్యాప్తంగా ముస్లింలు వేడుకలు నిర్వహించడానికి సన్నద్ధమయ్యారు. ఈ సందర్భంగా నూతన దుస్తులు ధరించి, ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం ర్యాలీలు, సహపంక్తి భోజనాలు, అన్నదానం చేయడం ఆనవాయితీ.

నేటి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 15 : ప్రతి వారం నిర్వహించనున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం మిలాద్-ఉన్ నబి (ప్రభుత్వ సెలవు దినం) సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించి సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకు ఓర్చి నంద్యాల జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయానికి రావొద్దని కోరారు. వచ్చే సోమవారం నుంచి కార్యక్రమం యథావిధిగా జరుగుతుందని ఎస్పీ తెలిపారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో



శ్రీశైలం, సెప్టెంబరు 15: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఆదివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. జూరాల నుంచి 27,850 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 13,437 క్యూసెక్కులు మొత్తం 41,287 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 59,574 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 884.40 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 206.0996 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రం ద్వారా 31,078 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.

శ్రీశైలంలో స్వచ్ఛతా హి సేవా


రహదారిని శుభ్రం చేస్తున్న ఈవో

శ్రీశైలం, సెప్టెంబరు 15: శ్రీశైలం క్షేత్ర పరిధిలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని ఆదివారం ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయం ముందుభాగంలో గల గంగాధర మండపం ప్రదేశంలో పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, క్షేత్ర పరిధిలోని వివిధ ప్రదేశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. విద్యార్థులకు వైద్యుల చేత పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి కార్యక్రమం ముగింపు రోజున దేవస్థానం తరపున బహుమతులను అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, సిబ్బంది, సీఐ ప్రసాదరావు పాల్గొన్నారు.

పర్యాటక ఎక్సలెన్స్ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 15: ఆంధ్రప్రదేశ్ టూరిజమ్ అథారిటీ విజయవాడ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యాటక ఎక్సలెన్స్ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి విజయ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు టూర్స్ అండ్ ట్రావెల్స్ సంబంధిత సంస్థల నుంచి దరఖాస్తులు పంపాలన్నారు. ఈ నెల 22లోపల వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టూరిజమ్.ఏపీ.జీవోవీ.ఇన్‌కు సంప్రదించాలన్నారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు



శ్రీమఠం ప్రాంగణంలో భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 15: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం లక్షలాది భక్తులు తరలి వచ్చారు. ఆదివారం సెలవు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగాణం భక్తులతో కిక్కిర్సింది. మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అశేషంగా భక్తజనం తరలి రావడంతో శ్రీమఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషిలు ప్రత్యేక బారికేడ్ల ద్వారా క్యూలైన్లు ఏర్పాటు చేశారు.

అన్నదాన పథకానికి రూ.18.73 లక్షలు విరాళం

మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం అన్నదాన పథకానికి కర్నూలుకు చెందిన తిమ్మయ్య రూ.లక్ష, బెంగళూరుకు చెందిన తేజస్ అనే భక్తుడు రూ. రెండు లక్షలు, అదే విధంగా వివిధ రాష్ట్రాలకు చెందిన భక్తులతో కలిపి రూ.18.73 లక్షలు విరాళంగా వచ్చినట్లు మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం దాతలు కుటుంబ సమేతంగా స్వామిని దర్శించుకుని విరాళం ఇచ్చినట్లు పేర్కొన్నారు. విరాళం ఇచ్చిన దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీర్వదించారు.

మహానందిలో భక్తుల రద్దీ

మహానంది, సెప్టెంబరు 15: ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా సెలవులు రావడంతో మహానంది క్షేత్రం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. రెండు రోజుల నుంచి క్షేత్రంలోని ప్రధాన వీధులు భక్తుల రద్దీతో కళకళలాడుతున్నాయి. తెల్లవారుజాముననే ఆలయం ప్రాంగణంలోని కోనేర్లలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి, ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కాగా సోమవారం కూడా మహానందిలో భక్తుల రద్దీ ఉండే అవకాశం ఉంది. ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి, సిబ్బంది భక్తులకు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

మహానందిలో కర్ణాటక హైకోర్టు జడ్జి



మహానంది క్షేత్రంలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ రామచంద్ర

మహానంది క్షేత్రంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డి.రామచంద్ర కుటుంబ సమేతంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద ఈవో నల్లకాల్వ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలను భక్తి శ్రద్ధలతో జరిపారు. కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు.

ఆత్మహత్య చేసుకుంటున్నట్లు యువకుడి సెల్ఫీ వీడియో

- ఎస్పీకి సమాచారం ఇచ్చిన బంధువులు
- అప్రమత్తం చేయడంతో యువకుడిని కాపాడిన పోలీసులు

నంద్యాల క్రైం, సెప్టెంబరు 15 : భార్య వియోగంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడిని నంద్యాల జిల్లా పోలీసులు రక్షించారు. గడివేముల మండలం మంచాలకట్ట గ్రామానికి చెందిన మానస (22) అనే వివాహిత శనివారం కుటుంబకలహాలతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా మానస భర్త దామోదరం అశోక్ జీవితంపై విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునేందుకు నిర్ణయించుకున్నానని బంధువులకు సెల్ఫీ వీడియో పెట్టాడు. విషయాన్ని బంధువులు వెంటనే నంద్యాల ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల డీఎస్పీ రంగప్రవేశం చేసి పోలీసు సిబ్బందితోపాటు బ్లూ కోల్ట్ సిబ్బందిని అప్రమత్తం చేశారు. బ్లూకోల్ట్ సిబ్బంది పొన్నాపురం నుంచి వెంకటేశ్వరపురం వరకు రైల్వే ట్రాక్, బనగానపల్లె రైల్వే ట్రాక్ వైపు వెదికారు. పోలీసుల రాకను గమనించిన దామోదరం అశోక్ రైల్వే ట్రాక్ నుంచి నంద్యాల బస్టాండ్ వైపు అక్కడి నుంచి శ్రీనివాస సెంటర్ మీదుగా రాజ్‌థియేటర్ వైపు వెళ్తుండగా సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పటికప్పుడు ఎస్పీ, డీఎస్పీలు సిబ్బందిని అప్రమత్తం చేశారు. దీంతో సినీఫక్కీలో దామోదరం అశోక్‌ను నంద్యాల టూ టౌన్ సీఐ ఇస్మాయిల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అక్కడ అతడికి కౌన్సెలింగ్ నిర్వహించి బంధువులను రప్పించి అప్పగించారు. దీంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. క్షణం ఆలస్యం చేయకుండా యువకుడిని కాపాడిన ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, నంద్యాల డీఎస్పీ, టూ టౌన్ సీఐ, బ్లూ కోల్ట్ సిబ్బంది, పట్టణంలోని పోలీస్‌సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అరిష్టమని..

వ్యక్తి మృతదేహాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

ఆదోని, సెప్టెంబరు 15 : మృతదేహాన్ని కాలనీలోకి తీసుకొస్తే అరిష్టమని అడ్డుకున్న ఘటన ఆదోని పట్టణంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఆదోని పట్టణంలోని శంకర్ నగర్ కాలనీకి చెందిన రాఘవేంద్ర (35) ఇటీవల అనంతపురం జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అక్కడ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తీసుకొని తాము నివాసముంటున్న శంకర్ నగర్ స్వగృహానికి తీసుకొస్తుండగా కాలనీ వాసులు అడ్డుకున్నారు. దీంతో కాలనీ వాసులకు బాధిత కుటుంబ సభ్యులకు మధ్య కొంత వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి చేసేది లేక బాధిత కుటుంబ సభ్యులు రాఘవేంద్ర మృతదేహంతో తమ బంధువులు నివాస ముంటున్న చిన్న మార్కెట్‌కు తీసుకువెళ్లి అక్కడ అంత్యక్రియలు చేసినట్లు సమాచారం.

అదృశ్యం కేసు నమోదు

హొళగుంద, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని లింగంపల్లి గ్రామానికి చెందిన మల్లేష్ అనే యువకుడు గత 15 రోజులుగా కనిపించకపోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాలనరసింహులు ఆదివారం తెలిపారు. మల్లేష్ ఈ నెల ఒకటవ తేదీన ఇంటి నుండి వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికి నా కనిపించలేదన్నారు. కుటుంబ సభ్యుడు గుడుదప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్ర వాహనం చోరీ

హొళగుంద, సెప్టెంబరు 15 : మండల పరిధిలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన హనుమంతప్ప అనే రైతుకు చెందిన బైక్ శనివారం రాత్రి అపహరణకు గురైనట్లు ఆదివారం తెలిపారు. ఎనిమిది నెలల క్రితం తెలంగాణకు వలస వెళ్లి అక్కడ కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపాడు. పెద్దహ్యాటలో శనివారం రాత్రి ఇంటి ముందు నిలబెట్టిన బైక్, ఉదయం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌యూలో టైం స్కేల్ వివాదం



- ఉద్యోగుల జీత, భత్యాలకు వర్సిటీ నిధులు
- ఫైనాన్స్ అప్రూవల్ లేని టైం స్కేల్‌ను రద్దు చేయాలి
- లోకాయుక్తలో ఫిర్యాదు చేసిన విద్యార్థి సంఘాలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 15: ఆర్‌యూలో టైం స్కేల్ వివాదం ముదురుతోంది. ఉద్యోగుల జీత, భత్యాలకు వర్సిటీ నిధులు వెచ్చించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రాయలసీమ యూనివర్సిటీ ఏర్పాటై దాదాపు 15 సంవత్సరాలవుతున్నా ఇప్పటి వరకు నాన్ టీచింగ్ విభాగానికి సంబంధించి ఒక్క నోటిఫికేషన్ లేకుండా పోయింది. కానీ ప్రస్తుతం వర్సిటీలో నాన్ టీచింగ్ ఉద్యోగులు దాదాపు 250 మంది ఉన్నట్లు వర్సిటీ రికార్డులు సూచిస్తున్నాయి. అందులో 110 మంది టైం స్కేల్ ఉద్యోగులు, ప్రభుత్వ అనుమతి లేని 13 మంది రెగ్యులర్ ఉద్యోగులు, తాజాగా వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న మరో 11 మంది నాన్ టీచింగ్ ఉద్యోగులు ఉన్నట్లు అంచనా. వర్సిటీ అధికారులు తమ స్వార్థం కోసం పదవీ కాలంతో పబ్బం గడుపుకోవడానికి విచ్చలవిడిగా ముడుపులు తీసుకొని అడ్డగోలుగా ఉద్యోగాలు కట్టబెట్టారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ అనుమతి లేకపోయినా 110 మందిని టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించడం, వారికి ప్రభుత్వ అనుమతి లేకున్నా ఇతర అలవెన్సులు వర్తింపజేయడం..అది కూడా యూనివర్సిటీ నిధుల నుంచి జీతాలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. వీటిపైన విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమాలకు తెరలేపాయి. తక్షణమే టైం స్కేల్ రద్దు చేయాలని, విద్యార్థుల సొమ్మును విద్యార్థుల డెవలప్‌మెంట్ కోసం ఉపయోగించకుండా ఉద్యోగుల జీత, భత్యాలకు ఎలా ఉపయోగిస్తారని విద్యార్థి సంఘాలు ఇటీవల లోకాయుక్తలో ఫిర్యాదు చేశాయి. వసతి గృహాల్లో ఇద్దరు సూపర్ వైజర్లను ఉద్యోగులుగా చేర్చుకుని రెండు ఏళ్లలోపే వారికి టైం స్కేల్ వర్తింపజేయడం గతంలో పెద్ద దుమారం రేపిన సంగతి తెలిసిందే. టైం స్కేల్‌ను రద్దు చేసి వర్సిటీలో ఉద్యోగులకు నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు ఇటీవల రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌ను వినతి పత్రం ద్వారా మంగళగిరిలో జరిగిన ప్రజా దర్బార్‌లో కోరారు. ఉద్యోగులకు సీఎఫ్‌ఎంఎస్‌తో సంబంధం లేకుండా ఇంటర్నల్‌గా జీతాలు వర్సిటీ నిధుల నుంచి ఇవ్వడంతో ప్రతి సంవత్సరం రూ.3 కోట్లకు పైగా ఖజానా నుంచి ఇస్తున్నారు. దీని వల్ల వర్సిటీ అభివృద్ధి కుంటుపడుతోంది. తక్షణమే ప్రభుత్వం స్పందించి యూనివర్సిటీ ఖజాన ఖాళీ కాకుండా, నోటిఫికేషన్ భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

టైం స్కేల్‌ను తక్షణమే రద్దు చేయాలి

తక్షణమే టైం స్కేల్‌ను రద్దు చేసి వర్సిటీ ఖజానకు గండి పడకుండా చర్యలు తీసుకోవాలి. ఇదే విషయంపై ఇటీవల లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేశాం. నోటిఫికేష్ ద్వారా నియమకాలు చేపట్టకుండా గత ఉపకులపతులు, అధికారులు నియామకాలు చేపట్టడం ఎంత వరకు సమంజసం. ప్రభుత్వ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే వర్సిటీ ఖజాన నుంచి జీత, భత్యలు ఇవ్వడం అంటే విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించడమే. విద్యార్థులు చెల్లించిన ఫీజుల ద్వారా వర్సిటీలో ఎన్నో రకాల అభివృద్ధి పనులు చేయాల్సింది పోయి సిబ్బందికి ఎలా వేతనాలు ఇస్తారు.

- రాగిరి చంద్రప్ప, రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్‌ఎఫ్

జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ విశ్వేశ్వరయ్య



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఇంజనీర్లు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు



విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న పీఆర్ ఇంజనీర్లు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 15: ఇంజనీరింగ్ రంగంలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన వారిలో భారత జాతి గర్వించదగ్గ ముద్దుబిడ్డ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా టెలికాంనగర్‌లోని ఆర్‌డబ్ల్యూఎస్ సర్కిల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మాహబూబ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు రామనీలా, కోశాధికారి అనంత్‌నాథ్, ఉమెన్ సెక్రటరీ సనా చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా పరిషత్ ఆవరణలో విశ్వేశ్వరయ్య భవన్ వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పీఆర్ ఈఈలు ఎస్‌సీఈ మద్దన్న, రామక్రిష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఈ టూ పీఏ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్, డీఈలు నాగిరెడ్డి, రమేష్‌కుమార్ రెడ్డి, ఏఈలు గౌస్‌బాష, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.
- సమాజాభివృద్ధికి శ్రమిస్తున్న ఇంజనీర్లు విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకోవాలని ఐజేకే ఇంజనీరింగ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ టి.పద్మజ అన్నారు. విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని గాయత్రి ఎస్టేట్‌లోని మోక్షగుండం విశేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో అకడమిక్ మేనేజర్ పరుశరాములు, వైస్ ప్రిన్సిపాల్ స్వాములు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విరాళం



సీఎం చంద్రబాబుకు చెక్కును అందజేస్తున్న నరసింహారావు

శిరివెళ్ల, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు రూ.2.03 లక్షలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌లోని సీఎం చంద్రబాబు నాయుడు నివాసంలో నేరుగా ఆయనను కలిసి రూ.2.03 లక్షల చెక్కును గోగిశెట్టి నరసింహారావు ఆదివారం అందజేశారు. నరసింహారావు మాట్లాడుతూ సీఎం ఆదేశాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన చేపట్టిన సహాయక చర్యలతో ఎన్నో కుటుంబాలు కోలుకున్నాయన్నారు. ముందుచూపు, విజన్‌తో పని చేసే సీఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతోనే విజయవాడ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గోగిశెట్టి ఆరోపించారు.

విజయవాడ వరద బాధితులకు విరాళం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు చెక్కుల అందజేత



విరాళం చెక్కును ఎమ్మెల్యేకు అందజేస్తున్న టీడీపీ నాయకుడు ఈవీ రమణ

కల్లూరు, సెప్టెంబరు 15: విజయవాడ వరద ముంపు బాధితులకు విరాళాలు అందించడం చాలా సంతోషంగా ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే స్వగృహంలో పలు గ్రామాల నాయకులు వరద బాధితుల కోసం చెక్కులను అందజేశారు. కల్లూరు మండల పరిధిలోని నాయకల్లు టీడీపీ నాయకులు వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు వాకిటి మాదేష్ ఆధ్వర్యంలో రూ. 1,11,016 విరాళాన్ని గౌరు చరితకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు నీలకంఠం లక్ష్మన్న, శ్రీనివాసులు, పెద్దమద్దయ్య, నాగేశ్వరరావు, బాలన్న, రామకృష్ణ ఉన్నారు. అలాగే తడకనపల్లె సర్పంచు, టీడీపీ నాయకురాలు ఎస్.సహారాబీ ఆధ్వర్యంలో సేకరించిన రూ. 1,76,100ను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు జేబేదాబీ, సుల్తాన్‌బాషా, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.



వరద బాధితులకు విరాళం అందజేస్తున్న సర్పంచ్ సహరాబీ, సుల్తాన్‌బాషా

'క్రీడల్లోనూ రాణించాలి'



విజేతలతో కేవీ సుబ్బారెడ్డి తదితరులు

కర్నూలు (రాజ్‌విహార్ సర్కిల్), సెప్టెంబరు 15: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్‌ఏ స్టేడియంలో 9వ రాష్ట్ర స్థాయి జూనియర్ ఆట్యాపాట్యా పోటీల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో క్రీడల్లో రాణిస్తే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విశిష్ట అతిథి డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ క్రీడాల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్లినప్పుడే వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన పల్నాడు జిల్లా జట్టుకు అతిథులతో కలిసి డాక్టర్ వాసురెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కర్నూలు జట్టు ఉత్తమ ప్రదర్శన కనబరిచి తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, ఆట్యా పాట్యా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరత్నమయ్య, బాలపవన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాణ్యం, సెప్టెంబరు 15 : మండలంలోని కొండజూటూరు సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో గ్రామానికి చెందిన జాకీర్ హుశేన్ (52) మృతి చెందారు. పాణ్యం పోలీసులు తెలిపిన వివరాలివీ.. పోలూరు నుంచి కొండజూటూరుకు మోటారుసైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో హఠాత్తుగా ఎదురు రావడంతో అదుపు తప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. క్షతగాత్రుడిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు.

షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ

కోవెలకుంట్ల, సెప్టెంబరు 15 : కోవెలకుంట్ల పట్టణంలోని గుంజలపాడు రహదారిలో ఉన్న షిర్డీసాయిబాబా దేవాలయంలో శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. సాయిబాబా దేవాలయం తలు పుల తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించి వాచ్‌మెన్ కొండయ్య నిద్రిస్తుండగా దాడి చేసి ముఖానికి వస్త్రాన్ని కట్టారు. దేవాలయంలోని హుండీని పగలగొట్టి రూ.15వేల నగదును ఎత్తుకెళ్లారు. అలాగే ఆలయంలో ఉన్న బ్యాటరీని పగలగొట్టి కరెంటు ఫీజును కూడా పెరికివేశారని ఆలయ పూజారి సతీష్ తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మంత్రి కుమారుడిపై దాడియత్నం

నంద్యాల, సెప్టెంబరు 15 (రూరల్): మంత్రి ఎన్ఎండీ ఫరూక్ కుమారుడు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్‌పై ఆదివారం రాత్రి దుండగులు దాడికి యత్నించారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు ఫిరోజ్ పార్టీ కార్యాలయం నుంచి బయటకు వస్తుండగా గుర్తు తెలియన నలుగురు వ్యక్తులు ఆయన వాహనాన్ని అడ్డగించి దాడి చేయడానికి యత్నించారు. వాహనంలోని కార్యకర్తలు వెంటనే తేరుకుని దాడి యత్నాన్ని అడ్డగించి, దుండగులను పట్టుకున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. మంత్రి కుమారుడిపై నడిరోడ్డు మీద దాడికి పాల్పడటంతో నంద్యాలలో కలకలం రేపింది. దాడికి దుండగులు ఎందుకు పాల్పడ్డారనే విషయంపై వివరాలు తెలియాల్సి ఉంది. అయితే ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవటంతో పోలీసులు కేసు ఇంకా కేసు నమోదు చేయలేదు.

చికిత్స పొందుతూ విద్యుత్ కార్మికుడి మృతి

పాణ్యం, సెప్టెంబరు 15 : విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతున్న విద్యుత్ కార్మికుడు ఓజ శ్రీనివాసులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు విద్యుత్ శాఖ అధికారి సుందరరాజు తెలిపారు. ఆదివారం విద్యుత్ సిబ్బంది శ్రీనివాసులు (54) మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గోస్పాడు, సెప్టెంబరు15: గోస్పాడు తెల్లపూరి గ్రామాల మధ్య కుందూ నది పరివాహక ప్రాంతంలోని పంట పొలాలలో గుర్తు తెలియని మృత దేహం లభ్యమైనట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ ఆదివారం తెలిపారు. సుమారు మగ మృతదేహం సుమారు 45-50 సంవత్సరాల మధ్య వయసు ఉంటుదని, బ్రౌన్ కలర్ షర్టు, నస్యం కలర్ ఫుల్ డ్రాయర్ ధరించినట్లు పేర్కొన్నారు. సుమారు 5.8 అడుగుల ఎత్తు ఉన్నారని మృతదేహాన్ని గుర్తు పట్టిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు/ కోడుమూరు రూరల్, సెప్టెంబరు 15: భారీ మొత్తంలో కర్ణాటక మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మద్యంతోపాటు రెండు కార్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్టు చేశారు. క్రిష్ణగిరి మండలానికి చెందిన మోహన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, కప్పట్రాలకు చెందిన వీరకృష్ణ, సి.బెళగల్ మండలానికి చెందిన యుగంధర్‌గౌడ్ కలిసి గత నెల రోజుల నుంచి కర్ణాటక నుంచి మద్యం తీసుకొచ్చి వ్యాపారం చేస్తున్నారు. ఇందులో భాగంగా క్రిష్ణాపురం గ్రామం సమీపంలో తెచ్చిన మద్యం ఇతర గ్రామాలకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రెండు కార్లు, రెండు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. పరార్ అయిన మరో నింది తుడు జయన్న కోసం గాలింపు చేపడుతున్నారు. పట్టుపడిన మద్యం విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుంది. ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు, ఏఎస్ఐ సురేంద్ర, కానిస్టేబుల్ జగదీష్, భాస్కర్, హోంగార్డు రాముడు, శేఖర్ ఉన్నారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఎక్సైజ్ దాడులు

కర్నూలు(అర్బన్): వినాయక నిమజ్జనం సందర్భంగా మద్యం అక్రమ అమ్మకాలపై దాడులు నిర్వహించామని ఎక్సైజ్ శాఖ సీఐ కేఆర్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆదివారం నగరంలో నిమజ్జనం సందర్భం గా ముజఫర్‌నగర్‌లోని కిరణ్ కుమార్‌గౌడ్ నుంచి 192 తెలంగాణ విస్కీ మద్యం బాటిళ్లు సీజ్ చేశామని, తెలంగాణలోని పుల్లూరుకు చెందిన బోయ సీతారాముడు నుంచి 30 బాటిళ్లను ఆటోలో తరలిస్తుండగా ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. తనిఖీల్లో డీటీఎఫ్ సీఐ నరసానాయుడు, ఎస్‌ఐలు మారుతీ, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి

రుద్రవరం, సెప్టెంబరు 15 : చికిత్స పొందుతూ రైతు మృతి చెందారు. ఆదివారం ఎస్ఐ హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తలూరుకు చెందిన రైతు వంగల నాగేశ్వర్‌రెడ్డి (45) ఈ నెల 12న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఎనిమిది ఎకరాల్లో సొంత పొలం, ఐదు ఎకరాలు కౌలు పొలం తీసుకుని వరి, మొక్కజొన్న, పత్తిపంటలు సాగు చేశాడు. సుమారు రూ. 12 లక్షల అప్పు ఉండటంతోనే తన భర్త గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని నాగేశ్వర్‌రెడ్డి భార్య మహేశ్వరి ఫిర్యాదు చేశారు. ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

రుద్రవరం, సెప్టెంబరు 15 : ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి నట్లు ఎస్ఐ వరప్రసాద్ ఆదివారం తెలిపారు. కడప జిల్లా జమ్మలమడుగు నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ట్రాక్టరులో ఇసుకను టి.లింగందిన్నె గ్రామానికి తరలిస్తుండగా తనిఖీ చేశామన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి డ్రైవరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

మాజీ సైనిక సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మాజీ సైనిక సంఘం నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 15: నందికొట్కూరు పట్టణంలో మాజీ సైనిక కార్యవర్గ కమిటీ ఎన్నికలు ఎస్ఈఎక్స్‌సీసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం నందికొట్కూరు పట్టణంలోని మాజీ సైనికుల కార్యాలయంలో ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నియోజకవర్గ మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్.చిన్న రంగస్వామి, జనరల్ సెక్రటరీగా జూపల్లి సాంబశివుడు, ట్రెజరర్‌గా నరసింహులు, ఇతర నూతన కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

ఘనంగా సైన్స్ కార్నివాల్

నందికొట్కూరు, సెప్టెంబరు 15: పట్టణంలోని శ్లోక పాఠశాలలో ఆదివారం సైన్స్ కార్నివాల్ 2024 నిర్వహించారు. సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని సృజనాత్మక బయటకు వస్తుందని శ్లోక పాఠశాల చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాలైన సైన్స్ ప్రదర్శనలు నిర్వహించారు. అదే విధంగా సైన్స్‌కు సంబంధించిన విషయాలను గురించి వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ డా.శ్రీనివాసరెడ్డి, డైరెక్టర్ కవితారెడ్డి, శ్రీదేవిరెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నీటి విడుదల



బానకచెర్ల నుంచి తెలుగుగంగకు విడుదలవుతున్న నీరు

పాములపాడు, సెప్టెంబరు 15: మండలంలోని బానకచెర్ల క్రాస్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా 30వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలుగుగంగ జేఈ దేవేంద్ర తెలిపారు. ఆదివారం పోతిరెడ్డి హెడ్ రెగ్యులేటర్ నుండి 30వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో వాటిని 12వేలు వీబీఆర్, 15వేలు జీఎన్ఎస్‌కు, కేసీకి 3వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తగదు



పారిశుధ్యం లోపించిన ప్రాంతాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, సెప్టెంబరు 15: ఆత్మకూరు పట్టణంలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం తగదని సీపీఎం నాయకులు రణధీర్, రజాక్, రామ్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని పారిశుధ్యం లోపించిన ప్రదేశాలను వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ.. పట్టణంలోని పలు కాలనీల్లో పారిశుధ్యం లోపించడంతో పాటు రోడ్లపైనే చెత్తా పేరుకుపోతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. అదేవిధంగా డ్రైనేజీ కాల్వలు కూడా అస్తవ్యస్తంగా ఉన్నాయని ఆరోపించారు. దీంతో దోమల వ్యాప్తి పెరిగి రోగాలు ప్రబలుతున్నాయని వివరించారు. కాగా మున్సిపల్ అధికారులు పన్ను వసూళ్లపై చూపుతున్న శ్రద్ధ పట్టణ ప్రజలకు వసతులు కల్పించడంలో చూపడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి ఆత్మకూరు పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాములపాడు, సెప్టెంబరు 15: కల్లుకుంట్ల గ్రామంలో దళిత మహిళను నగ్నంగా కరెంటు స్తంభానికి కట్టేసి కొట్టిన వారిని పోలీసులు అరెస్టు చేసి శిక్షించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు, నవ్యాంధ్ర మాలమహానాడు జిల్లా నాయకులు అబ్రహాం, జాతీయ మాలమహానాడు రాయలసీమ అధ్యక్షుడు అంకన్న పలు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పాములపాడు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ, కర్నూలు జిల్లా పెద్ద కడుబూరు మండలంలోని కల్లుకుంట్ల గ్రామంలో దళిత వార్గానికి చెందిన వీరన్న అదే గ్రామానికి చెందిన వేరే కులం వారు కట్టేసి కొట్టడం దారుణమని, దాడికి పాల్పడిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, సెప్టెంబరు 15: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచకాల వల్లే ప్రజలు టీడీపీ ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో బీసీల సంక్షేమం కోసం ఆదరణ పనిముట్లు, బ్యాంకు రుణాలు అందజేసి ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చారని అన్నారు. వైసీపీ పాలనలో బీసీల నిధులను నిర్వీర్యం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు చేస్తున్న వరద సహాయ చర్యలపై బురద చల్లడం తగదని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రామతీర్థం, కార్యదర్శి పీరయ్య, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

అక్రమ వసూళ్లు!

- బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో దోపిడీ..!
- అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ చేతివాటం
- పట్టించుకునే నాథుడే కరువు

ఆత్మకూరు, సెప్టెంబరు 15:

కేంద్ర ప్రభుత్వ రంగ టెలికమ్యూనికేషన్ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆత్మకూరు కార్యాలయంలో వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారు. అడిగే వారు ఎవరూ లేరనుకున్నారో ఏమో తెలియదు కానీ.. సంస్థ ద్వారా వినియోగదారులకు అందించే అన్ని రకాల సేవల్లో ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అయితే వినియోగదారులకు జరుగుతున్న అన్యాయాన్ని కార్యాలయంలో ఎవరికీ చెప్పుకోలేని పరిస్థితులు ఉన్నాయి. అసలు కార్యాలయంలో సంబంధిత అధికారులెవరూ అక్కడ అసలు కనిపించరు. పైగా జిల్లా ఉన్నతాధికారులు కూడా ఇక్కడికి వచ్చిన తనిఖీలు చేసిన సందర్భాలు లేవని తెలుస్తోంది. దీంతో ఇదే అదునుగా బీఎస్ఎన్ఎల్ ఆఫీసులో జరుగుతున్న దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోయిందన్న విమర్శలు ఉన్నాయి.

ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ అక్రమ వసూళ్లు

కొంత కాలంగా బీఎస్ఎన్ఎల్ ఆఫీసుల్లోనే ఆధార్ కార్డుల్లో పేరు, అడ్రస్, డేట్ ఆఫ్ బర్త్ తదితర వివరాలను అప్‌డేట్ చేసుకోవడంతో పాటు ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింకేజీ చేసుకునే వెసులుబాటు కల్పించారు. ఈసేవలకు రుసుము రూ.50 వసూళ్లు చేయాల్సి ఉండగా రూ.100కు పైగానే వసూలు చేస్తున్నారు. పైగా ఆధార్ కార్డులో ఒకే సందర్భంలో అన్ని వివరాలను మార్చుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ ఒక్కొక్కటి ఒక్కో సందర్భంలో మార్చి దండుకుంటున్నారు. దీనికితోడు ఇటీవల కాలంగా దేశంలోని ప్రైవేట్ రంగ టెలికమ్యూనికేషన్ సంస్థలు యూజర్ చార్జీలను భారీగా పెంచడంతో చాలా మంది ప్రైవేట్ టెలికమ్యూనికేషన్ల యూజర్లు బీఎస్ఎన్ఎల్‌లోకి తమ సిమ్ కార్డులను మార్చుకుంటున్నారు. ఈ క్రమంలో సిమ్ కార్డు పోర్టు అయ్యేందుకు రూ.150 వరకు వసూలు చేస్తున్నారు. ఇవేకాకుండా 4జీ సిమ్ పొందేందుకు బీఎస్ఎన్ఎల్ ఉచిత సర్వీసును అందుబాటులో ఉంచారు. అయితే 4జీ సిమ్ కార్డు ఇచ్చేందుకు కూడా చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇలా బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ద్వారా అందే అన్ని సర్వీసులను అదనంగా వసూలు చేస్తున్నప్పటికీ రశీదులు మాత్రం ఇవ్వడం లేదు. అలాగే ఆయా సర్వీసుకు ఎంత చార్జీ అవుతుందన్న వివరాలతో కూడిన పట్టిక కూడా అక్కడ అమర్చలేదు.



బీఎస్ఎన్ఎల్ ఆఫీసులోని ఆధార్ అప్‌డేట్ సెంటర్

పత్తాలేని బీఎస్ఎన్ఎల్ అధికారులు

ఆత్మకూరు బీఎస్ఎన్ఎల్ కార్యాలయ అధికారులు ఎప్పుడు అందుబాటులో ఉండరన్న విమర్శలు ఉన్నాయి. ఇక్కడ జేటీఓ స్థాయి అధికారి ఉంటారని చెబుతున్నప్పటికీ ఆయన కార్యాలయంలో ఎక్కువ సమయం గడపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. మిగతా ఉద్యోగులు కూడా కాసేపు అలా కార్యాలయానికి వచ్చి ఆ తర్వాత తమ సొంత పనులు చేసుకునేందుకు బయటకు వెళ్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇప్పుడిప్పుడే దేశంలో బీఎస్ఎన్ఎల్ సేవల పట్ల వినియోగదారులు ఆకర్షితులవుతుంటే సంస్థ అభివృద్ధికి కృషి చేయాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ప్రతినెలా తీసుకునే జీతానికి తగ్గట్లుగా ఉద్యోగులు విధులు నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.



ఆత్మకూరులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసు

నెలకు రూ.లక్షల్లో వసూళ్లు

ఇటీవల కాలంలో బ్యాంకు ఖాతాలకు సంబంధించి తప్పనిసరిగా ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింకేజీ అవసరం కానుంది. అలాగే ఆధార్ కార్డుల్లో నమోదైన పొరపాట్లను సరిచేసుకుంటుంటారు. ఈ అవసరాలతో పాటు బీఎస్ఎన్ఎల్ టెలికామ్ సేవల కోసం ప్రతిరోజూ ఆత్మకూరులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీసుకు చాలా మంది వినియోగదారులు వస్తుంటారు. అయితే ఒక్కొక్కరి నుంచి రూ.50, రూ.100 తదితర అదనపు రుసుముల పేరిట చేతివాటం ప్రదర్శించడంతో సదరు అనధికార వ్యక్తులకు ప్రతిరోజూ వేల రూపాయాల్లో అక్రమార్జన సమకూరుతోందన్న విమర్శలు ఉన్నాయి.

ధరల పట్టికను ఏర్పాటు చేస్తాం

కార్యాలయ పరిధిలో ఆయా సేవలకు సంబంధించిన రుసుముల పట్టికను అందుబాటులో ఉంచుతాం. అలాగే సమాచారం హక్కు చట్టం - 2005 ప్రకారం కార్యాలయ సమాచారం, అధీకృత అధికారి వివరాలను పొందుపరుస్తాం అదేవిధంగా పొందిన సేవలకు సంబంధించిన రుసుములకు రశీదులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. వినియోగదారులెవరూ నిర్ణయించిన రుసుము కంటే అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు.

- నారాయణస్వామి, డీఈ, ఆఫీసు, ఆత్మకూరు

ఇంజనీర్లకు మార్గదర్శకుడు మోక్షగుండం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 15: ఇంజనీర్లకు స్ఫూర్తిదాయకం మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని పంచాయతీరాజ్ డీఈ గంగాధర్ అన్నారు. ఆదివారం నంద్యాల పంచాయతీరాజ్ కార్యాలయంలో ఇంజనీర్స్ డే ను పురస్కరించుకుని విశ్వేశ్వరయ్య సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అపార తెలివితేటల వల్ల ఎన్నో బహుళార్థ సాధక ప్రాజెక్టుల నిర్మాణ సృష్టికర్తగా విశ్వవిఖ్యాత కీర్తిని సంపాదించారని తెలిపారు. భారతీయ నైపుణ్యాన్ని ప్రపంచానికి సాటిన సంపన్నులుగా ఆయన అభివర్ణించారు. విశ్వేశ్వరయ్యను స్ఫూర్తిగా తీసుకుని దీక్షాదక్షితలతో పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈలు మదన్, మల్లికార్జున, బాస్కర్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీర్ల పాత్ర విశిష్టమైనది

దేశనిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర విశిష్టమైనదని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ సీనియర్ ప్రతినిధి డా.రవికృష్ణ అన్నారు. భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆదివారం జాతీయ ఇంజనీర్ల దినోత్సవాన్ని నంద్యాల లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డా.రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను వివరించారు. నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ అధ్యాపకులు ఉమామహేశ్వరప్ప, రాజశేఖర్‌రెడ్డిలను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి లయన్స్‌క్లబ్ జాతీయ ఇంజనీర్ల దినోత్సవ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నంద్యాల శాఖ అధ్యక్షుడు నిజాముద్దీన్, పీవీ సుధాకర్‌రెడ్డి, కార్యదర్శి రమేష్, జిల్లా చైర్మన్లు రవిప్రకాష్, చంద్రమోహన్, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆర్జీఎం, శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలల్లో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు ఆధ్వర్యంలో మోక్షగుండం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కళాశాల డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ గోపీకృష్ణారావు, పీడీ వెంకటేశ్, రఘునాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న డీఈ గంగాధర్



ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న చైర్మన్, అధ్యాపకులు

వరద బాధితులకు కొనసాగుతున్న సాయం

ఆత్మకూరు, సెప్టెంబరు 15: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు శ్రీశైలం నియోజకవర్గం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో బండిఆత్మకూరు మండలంలోని కాకనూరు గ్రామానికి చెందిన పరమేశ్వరరెడ్డి రూ.5లక్షలు, ఆత్మకూరు బారు అసోసియేషన్ తరపున ఆ సంఘం అధ్యక్షులు వేముల వెంకటేశ్వర్లు, సీనియర్ అడ్వకేట్స్ కంచర్ల గోవిందరెడ్డి, శాఖమూరి గిరిరాజు, రవికుమార్ తదితరులు రూ.లక్ష విరాళం అందజేశారు. అదేవిధంగా టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర నాయకులు రజాక్ రూ.లక్ష, జీవనజ్యోతి వికలాంగుల సేవా సంఘం తరపున ఆ సంఘం అధ్యక్షులు రూ.10వేలు, ఆత్మకూరు ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ తరుపున రూ.20116, ఆత్మకూరు డాక్యుమెంట్ రైటర్స్ అసోసియేషన్ తరుపున రూ.50వేలు, ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1989-90 బ్యాచ్ పూర్వ విద్యార్థులు యుగంధర్, మగ్బుల్‌బాషాలు రూ.50వేలు, ఆత్మకూరు జీపు అసోసియేషన్ తరుపున ఆ సంఘం నాయకులు పీర్ల వలి రూ.20వేలు విరాళం అందజేశారు. ఇవేకాకుండా ఆయా గ్రామాలు, వార్డుల తరుపున భారీగా విరాళాలు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా మాట్లాడుతూ.. శ్రీశైలం నియోజకవర్గం తరుపున విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని తాను ఇచ్చిన పిలుపునకు స్వచ్ఛందంగా స్పందించి విరాళాలు అందజేసి వారందరికి అభినందనలు తెలిపారు. ఈ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు చేరవేయనున్నట్లు ప్రకటించారు.

వరద బాధితులకు జనసేన పార్టీ చేయూత :

విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తమ వంతు విరాళాన్ని అందజేశారు. ఆదివారం ఆ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి శ్రీరాములు, నాయకులు శేషకుమార్, అమర్‌నాథ్, చంద్రశేఖరరెడ్డి, భాస్కర్, అరుణ్, నారాయణ, షాలు బాషా తదితరులు రూ.41500 విరాళాన్ని అందజేశారు. తమనేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో తాము సైతం వరద బాధితులకు అండగా నిలవాలన్న సంకల్పంతోనే విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు.

టీడీపీ నాయకులను అభినందించిన ఎమ్మెల్యే

బండిఆత్మకూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళాలు సేకరించి, సొంతంగా డబ్బు సహాయం చేసిన టీడీపీ నాయకులను ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. మండలంలోని పరమటూరుకు చెందిన టీడీపీ నాయకులు సాయిబాబారెడ్డి, పరమేశ్వరరెడ్డి, చంద్ర శేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, నాయుడు, నాగేంద్ర, మౌలాలి, గోపాల్ రూ.77,000 నగదును ఎమ్మెల్యే అందజేశారు. అలాగే ఏ కోడూరుకు చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, మోహన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శివకుమార్, సుధాకర్, శంకర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, శివలింగం, చెంచన్న, సుబ్రహ్మణ్యం, చాంద్ బాషా రూ.1,55,000 నగదును ఎమ్మెల్యేకు అందజేశారు. అలాగే వెంగళరెడ్డి పేట నాయకులు రూ,80వేలు, కడమలకాల్వ టీడీపీ నాయకులు రూ.75 వేలు విరాళాల నగదును అందజేశారు.

మహానంది: వరద బాధితుల కోసం మండల టీడీపీ కార్యకర్తలు ఇంటింటా తిరిగి విరాళాలు సేకరించారని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మహానందిలోని విశ్రాంతి భవనంలో రూ.17.30 లక్షలను విరాళాలు సేకరించారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బన్నూరి రామలింగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుడ్డాకు రూ.లక్ష విరాళం అందజేస్తున్న ఆత్మకూరు బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు



ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి నగదును అందజేస్తున్న ఎ.కోడూరు టీడీపీ నాయకులు

కమిటీలు ఏర్పాటు చేయాలి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 15 : మహిళల భద్రత కోసం తక్షణమే కమిటీలు ఏర్పాటు చేయాలని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్‌రావు, రాంకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలో జరిగిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అరాచకాల నుంచి రక్షణ కోసం 2013లో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిషేధ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచార ఘటనలను ఓపీడీఆర్ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళపై జరిగే దాడులను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన హైకోర్టు కర్నూలులో ఏర్పాటు చేయాలని, లోకాయుక్త, మానవహక్కుల కమిషన్, వక్ఫ్ ట్రిబ్యునల్ తదితర న్యాయవ్యవస్థకు సంబంధించిన ట్రిబ్యునల్స్ అన్నింటికి శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సహాయ కార్యదర్శులు ఈశ్వర్, శివశంకర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుధాకర్‌రావు

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆత్మకూరు, సెప్టెంబరు 15: నిబంధనలు పాటించని ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్‌కుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజుల పాటు పాఠశాలలకు వరుస సెలవులు ఉన్నప్పటికి పలు ప్రైవేట్ పాఠశాలలకు నిబంధనలకు విరుద్ధంగా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల విద్యార్థులకు ఒత్తిళ్లకు గురవుతున్నట్లు చెప్పారు. కాగా ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు దిలీప్, బాబు, అంజి, రవి, భరత్, నవీన్ తదితరులు ఉన్నారు.

మహానందిని అభివృద్ధి చేస్తాం

మహానంది, సెప్టెంబరు 15: మహానందిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డితో అభివృద్ధి పనులపై చర్చించారు. స్థానిక విశ్రాంతి భవనంలో ఈవో ఎమ్మెల్యే బుడ్డాను కలిశారు. మహానంది అభివృద్ధితో పాటు నవనంది క్షేత్రాలను అభివృద్ధి పరిచి వాటిని కూడా భక్తులు సందర్శించేలా ఏర్పాటు చేయాలనే అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో ఎర్రమల్ల మధు, వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగోడు: ముస్లిం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెలుగోడు మండలంలోని మోత్కూర్ గ్రామంలో ముస్లిం మత పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభించిన నూతన మసీదు కార్యక్రమంలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ ఈవోకు నగదును అందజేస్తున్న దాతలు

పాణ్యం, సెప్టెంబరు 15: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళం అందించారు. నంద్యాల మండలం అయ్యలూరు మెట్ట గ్రామానికి చెందిన హేమసాయి, ఈశ్వరరెడ్డి, కుటుంబసభ్యులు ఆదివారం కొత్తూరు ఆలయ అభివృద్ధి కోసం రూ.50 వేలు ఆలయ ఈవో రామకృష్ణకు అందజేశారు. దాతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆసుపత్రికి రాని వైద్యులు

ఇబ్బంది పడ్డ రోగులు



ఎర్రమఠం గ్రామంలో వైద్యుల కోసం ఎదురు చూస్తున్న రోగులు

కొత్తపల్లి, సెప్టెంబరు 15: మండలంలోని ఎర్రమఠం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యులు ఇష్టానుసారంగా విధులకు హాజరవుతున్నారు. 24 గంటలు వైద్యశాల అయినప్పటికీ ఆదివారం అనుకున్నారో ఏమో తెలియదు కాని ఉదయం 11 గంటలు దాటిన వైద్యుల సిబ్బంది విధులకు హాజరు కాలేదు. ఉదయం 9 గంలకు పాత మాడుగుల గ్రామానికి చెందిన నాగశేషన్న, ఈదమ్మ, సుబ్బరాయుడులు టైఫాయిడ్ జ్వరాలతో బాధపడుతూ వైద్యశాలకు వచ్చారు. వైద్యులు లేకపోవడంతో ఇబ్బంది పడుతూ వెనుదిరిగి వెళ్లిపోయారు. గ్రామ టీడీపీ నాయకులు గౌరు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ వైద్య సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యే విధంగా ఉన్నాతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంపై వైద్యాధికారిని జుబేరును వివరణ కోరగా ఆదివారం వైద్యులకు సెలవు ఉపటుందని, అత్యవసర చికిత్స అవసరమైతే హాజరు కావాల్సి ఉంటుంది. మిగతా సమయాల్లో డ్యూటీ సిబ్బంది మాత్రమే రోగులను పరీక్షస్తారని తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు: సీఐ



మాట్లాడుతున్న సీఐ ఇంతియాజ్ బాషా

డోన్(రూరల్), సెప్టెంబరు 15: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా అన్నారు. ఆదివారం వడ్డెర సంఘం కార్యాలయంలో వడ్డెర్లకు సమాజంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వడ్డెర్లు తమ పిల్లలను బాగా చదివించుకోవాలన్నారు. కార్యకరమంలో నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

బనగానపల్లె, సెప్టెంబరు 15: పట్టణంలో తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రీల సంఘం నాయకులు ముక్బూల్ హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్, గంగాధర్, బాషా పాల్గొన్నారు.

రేపు యాగంటిలో వేలం పాటలు

బనగానపల్లె, సెప్టెంబరు 15: మండలంలోని యాగంటి పుణ్యక్షేత్రంలో మంగళవారం వివిధ వ్యాపారాలకు సంబంధించి వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖరరెడ్డి ఆదివారం వెల్లడించారు. టెంకాలయ విక్రయాలు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేం దుకు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 15: రౌడి షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పట్టణ సీఐ చిరంజీవి అన్నారు. ఆళ్లగడ్డ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు అల్లర్లకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

డోన్(రూరల్), సెప్టెంబరు 15: ఇటీవల రిటైర్డ్ అయిన ఉద్యోగులను పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు అధ్యక్షుడు భానుసింగ్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులు ప్రశాంత జీవితం గడపాలన్నారు. కార్యక్రమంలో గాలయ్య, సుబ్బారాయుడు, గోపాల్, నరసింహులు, రామక్రిష్ణారెడ్డి, రాందాసురెడ్డి పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, సెప్టెంబరు 15: టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అరాచకాల వల్లే ప్రజలు టీడీపీ ప్రభుత్వానికి పట్టం కట్టారని అన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయంలో బీసీల సంక్షేమం కోసం ఆదరణ పనిముట్లు, బ్యాంకు రుణాలు అందజేసి ఆర్థికాభివృద్ధికి చేయూతనిచ్చారని అన్నారు. వైసీపీ పాలనలో బీసీల నిధులను నిర్వీర్యం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు చేస్తున్న వరద సహాయ చర్యలపై బురద చల్లడం తగదని అన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు రామతీర్థం, కార్యదర్శి పీరయ్య, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, బీసీ సంఘ నాయకులు సిద్ధప్ప, పిచ్చయ్య, వాసు, చిన్నికృష్ణయ్య, లాలయ్య, రమణయ్య పాల్గొన్నారు.

అతిసారతో అప్రమత్తంగా ఉండాలి


చాగలమర్రి, సెప్టెంబరు 15: గ్రామాల్లో ప్రజలు అతిసార వ్యాధితో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు ఇమ్రాన్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ విరేచనాలు అధికమైన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్య చికిత్సలు చేయించుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ద్రావణం తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని పేర్కొన్నారు. జలుబు, జ్వరం, డెంగ్యీ, టైఫాయిడ్ జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని అన్నారు. ఎఫ్‌డీపీ కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరు

చాగలమర్రి, సెప్టెంబరు 15: మండలంలోని కేసీ ప్రధాన కాలువ నుంచి చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కేసీకెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు. ఆదివారం కేసీ కాలువలో ప్రవహిస్తున్న నీటిని ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాజోలి ఆనకట్ట వద్ద 10,500 క్యూసెక్కుల నీరు కుందూలో ప్రవహిస్తోందని అన్నారు. కేసీ ప్రధాన కాలువలో 750 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోందని, రైతులు సాగునీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని అన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్ దస్తగిరి ఉన్నారు.

ఏడాదిగా స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీ

● వైద్య సేవలకు అంతరాయం ● పట్టించుకోని అధికారులు



ప్యాపిలి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం

ప్యాపిలి, సెప్టెంబరు 15: పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఏడాదిగా స్టాఫ్‌నర్సు పోస్టు ఖాళీగా ఉంది. దీంతో ఆసుపత్రిలో వైద్యసేవలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. అయినా అధికారులు పట్టించుకో వడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆరోగ్య కేంద్రానికి నిత్యం పదుల సంఖ్యలో గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షల కోసం వస్తుంటారు. గర్భిణులకు పరీక్షలు, కాన్పులు చేయాలన్నా స్టాఫ్‌నర్సులు ఉండా ల్సిందే. అయితే ఇక్కడ స్టాఫ్‌నర్సు లేకపోవడంతో వైద్యసేవలకు ఇబ్బం దిగా మారింది. ఆసుపత్రిలో మూడు స్టాఫ్‌నర్స్ పోస్టులు ఉండగా ప్రస్తు తం ఇద్దరు మాత్రమే ఉన్నారు. రోజులో ఎనిమిది గంటలకు ఒకరు చొప్పున మూడు సిఫ్టులు విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే ఒక పోస్టు ఖాళీగా ఉన్నందున రాత్రిపూట విధులకు కష్టంగా మారిందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అధికారులు స్పందించి పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సు పోస్టును భర్తీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంచం పట్టిన తోడెండ్లపల్లె

» జ్వరాలతో అల్లాడుతున్న గ్రామస్థులు

చాగలమర్రి, సెప్టెంబరు 15: మండలంలోని తోడెండ్లపల్లె, మల్లేవేముల గ్రామాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. తోడెండ్లపల్లె గ్రామంలో ఇంటికి ఒకరిద్దరు చొప్పున జ్వర బాధితులు మంచం పట్టారు. ఒకే కుటుంబానికి చెందిన రాంమోహన్, చంద్రప్రియ, హేమాంజలి, లక్ష్మీదేవి, రాజశేఖర్, రామకృష్ణుడుతో పాటు మరో 50 మంది దాక జ్వరాల బారిన పడ్డారు. రోజుల తరబడి జ్వరాలు తగ్గక పోవడం, అది సాధారణ జ్వరమా, వైరల్ ఫివరా అని జ్వర పీడితులు భయపడుతున్నారు. జ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో నిండిపోతున్నాయి. జ్వర పీడితులు అధిక భాగం వైరల్ ఫివర్, టైఫాయిడ్‌వారే ఉన్నారు. మల్లేవేముల ఎస్సీ కాలనీలో జ్వరాలతో అల్లాడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా పారిశుధ్యం అధ్వానంగా మారింది. మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దీంతో దోమలకు ఆవాస కేంద్రాలుగా మారి కంటి మీద కునుకు లేకుండా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటు వల్ల జ్వరాల బారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ పౌడర్, హెబిట్ ద్రావణంతో పిచికారి చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



తోడెండ్లపల్లెలో రహదారిలో ప్రవహిస్తున్న మురుగు



మంచం పట్టిన జ్వర పీడితులు

అప్రమత్తంగా ఉండాలి: వైద్యులు సుల్తానా

వాతావరణం మార్పుతో సీజనల్ వ్యాధులు అధికమయ్యాయి. టైఫాయిడ్, డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం జ్వర బాధితులు అధికంగా ఉన్నారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఇంటి చుట్టూ, పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలి. జ్వర బాధితులు నిర్లక్ష్యం చేయకుండా చికిత్సలు చేయించుకోవాలి.

ఘాటు తగ్గిన పచ్చిమిర్చి

» 50 కేజీల బస్తా రూ.600

» జూలైలో రూ.2,600, సెప్టెంబరులో రూ.600



పచ్చి మిరపను చూపుతున్న రైతులు

రుద్రవరం, సెప్టెంబరు 15: జూలైలో పచ్చిమిర్చి ధరలు ఆకాశన్నంటాయి. సెప్టెంబరులో మాత్రం పూర్తిగా ధరలు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆదివారం పచ్చిమిర్చి 50 కేజీల బస్తా రూ.600 పలికింది. జూలై మాసంలో రూ.2,600, ఆగస్టులో 2,500 రేట్లు పలికాయి. సెప్టెంబరుమాసంలో 15న రూ.600 మాత్రమే రేటు పలికింది. ఒక్కసారిగా ఒక బస్తాపై రూ.1,800 రేటు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎగుమతి ఇలా.. రుద్రవరం మండలం ఆలమూరు, రుద్రవరం, నాగులవరం గ్రామాల నుంచి పచ్చిమిర్చి చెన్నై, రాజమండ్రి, తణుకు భీమవరం, ఏలూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు పచ్చిమిర్చి ఎగుమతి చేస్తున్నారు. దళారులు నిర్ణయించిన రేటుకే విక్రయిస్తున్నామని రైతులు వాపోతున్నారు. కోత, రవాణా ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పచ్చిమిర్చికి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

హిందూ ధర్మ ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి



మాట్లాడుతున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

శిరివెళ్ల, సెప్టెంబరు 15: హిందూ ధర్మ ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ చాటి చెప్పాలని విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి అన్నారు. శ్రీరామ సేన కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని యర్రగుంట్ల అమ్మవారిశాలలో విశ్వహిందూ పరిషత్ మండలస్థాయి కార్యకర్తల రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. హిందూ దేవాలయాల్లో అన్యమతస్థులు బినామీ పేర్లతో చేస్తున్న వ్యాపారాలను ప్రభుత్వం అడ్డుకోవాలన్నారు. జిల్లాలోని మహానంది, యాగంటి, మద్దిలేటి స్వామి, నందవరం క్షేత్రాల్లో అన్యమతస్థుల ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. జిల్లా కార్యదర్శి కిషోర్ కుమార్, మూసాని విశ్వనాథరెడ్డి, భజరంగదళ్ జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి, కో-కన్వీనర్ కమతం రాజశేఖర్‌రెడ్డి, విద్యార్థి ప్రముఖ్ కమ్మయ్య పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం



ఆలయ సిబ్బందికి విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె, సెప్టెంబరు 15: మండలంలోని నందవరం చౌడేశ్వరీ దేవి ఆలయాభివృద్ధి కోసం దాతలు రూ.50వేలు విరాళాన్ని అందించారు. డోన్ పట్టణానికి చెందిన బొబ్బిలి మోక్షిత, వారి కుటుంబ సభ్యులు ఆలయ కార్యనిర్వాహణ అధికారి కామేశ్వరమ్మ, మాజీ చైర్మన్ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ సిబ్బందికి ఈ విరాళాన్ని అందజేశారు.

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కొలిమిగుండ్ల పీహెచ్‌సీ వైద్యులు హరిచరణ్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. మండలంలో మొత్తం 9600మంది చిన్నారులకు అల్బెండజోల్ మాత్రలను వేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా గ్రామ సచివాలయాల్లో మాత్రలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

పంట నమోదుకు గడువు పొడిగింపు: ఏవో

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు సంబంధించి పంట నమోదు గడువు ఈనెల 30వరకు పొడిగించినట్లు మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పంట నమోదు చేసుకోని రైతులు త్వరితగతిన పంట నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆమె సూచించారు.

వర్షం కోసం గంగమ్మ పూజలు

ప్యాపిలి, సెప్టెంబరు 15: మండలంలోని కౌలుపల్లి గ్రామంలో వర్షం కోసం ఆదివారం గంగమ్మ పూజలు నిర్వహించారు. అలాగే పూజల్లో భాగంగా కడవ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాభావ సమయంలో ఇలా కడవ తిప్పితే వర్షం వస్తుందని ఇక్కడ అనాదిగా వస్తున్న ఆచారమని గ్రామస్థులు తెలిపారు.

పుట్టాలమ్మకు..

ఆళ్లగడ్డ, సెప్టెంబరు 15: ఆళ్లగడ్డ మండలంలోని ఆర్.క్రిష్ణాపురంలో వెలసిన రామతీర్థం పుట్టాలమ్మకు ఆదివారం భక్తులు పూజలు చేశారు. క్షేత్రంలో వెలసిన అమ్మవారికి పూజలు చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. వీరంతా అమ్మవారికి మొక్కులు తీర్చుకొని కానుకలు సమర్పించుకున్నారు. భక్తులకు ఈవో సాయిజయచంద్రారెడ్డి అన్నదానం చేశారు.

ఓబులేసు కోన ఆలయంలో భజనలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: మండలంలోని మదనంతపురం గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన పురాతన ఓబులేసు కోన ఆలయంలో ప్రత్యేక భజనలు నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వరుణ దేవుడి కరుణ కోసం మదనంతపురం గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులు ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

అవుకు, సెప్టెంబరు 15: అవుకు పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1985 -86 సంవత్సరానికి చెందిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం జరుపుకున్నారు. 39 సంవత్సరాల అనంతరం విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మధురానుభూతిని పొందారు. విద్యను బోధించిన గురువులు మేడం పార్వతీశం, ఈగల సుబ్బరాయుడు, క్లర్కు పక్రుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు. వారితో పాటు ప్రస్తుత అవుకు జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శింగయ్య, చెన్నకేశ్వరిలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మొట్ల రామిరెడ్డి, రవీంద్రనాథరెడ్డి, పక్కీరయ్య, భాస్కర్, జెవీ సత్యనారాయణ, మిద్దె ప్రసాద్, సుబ్బరాయుడు, సురేష్, సుబ్బయ్య, సుధాకర్, వీరయ్య, నాగేశ్వరమ్మ, ప్రసన్నలక్ష్మి, రేవతి, శ్రీదేవి, రాజేశ్వరి, లక్ష్మిదేవి, శైలజ, అరుణకుమారి పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో 2003-2004 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఎంఈవో అనూరాధ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కర్నూలు, కడప, నంద్యాల, అనంతపురం, హైదరాబాదు, చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో స్థిరపడిన 80 మంది పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు, ఎంఈవో అనూరాధ, రమణమ్మ, సరస్వతి, విజయభాస్కర్‌రెడ్డి, నాగేంద్ర ప్రసాదు, సుధాకర్‌గుప్త, సురేంద్ర, జయరాముడు, భాస్కర్‌రెడ్డి, వెంకటరమణ, శాస్త్రీ, గురుశేఖర్, ఉపాధ్యాయేతర సిబ్బంది బాబు, యశోద, లక్ష్మీదేవమ్మలను సన్మానించారు. ప్రస్తుత హెచ్ఎం కోటయ్య, పీడీ దాదాపీర్‌లను కూడా సత్కరించారు. అనంతరం దివంగతులైన ఉపాధ్యాయులు బయపురెడ్డి, ఠాగూర్, వాచ్‌మెన్ పుల్లయ్య, మృతి చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మశాంతికి నివాళులర్పించారు.



అవుకులో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



చాగలమర్రిలో..

భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం



హోమం చేస్తున్న అభినవ శంకరానందస్వామి

చాగలమర్రి, సెప్టెంబరు 15: చాగలమర్రి గ్రామంలోని శివరామానంద ఆశ్రమంలో భాద్రపదమాసం సందర్భంగ పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో వరుణ దేవుడు కరుణించాలంటూ భక్తిశ్రద్ధలతో మహా చండీయాగం, గణపతి హోమం, రుద్రాభిషేకం చేశారు. మహిళలు సామూహికంగా శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు, హిందూ సంఘ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

రేపు ఎస్ఎంసీ సమావేశం

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మంగళవారం పాఠశాల యజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) సమావేశాన్ని నిర్వహించనున్నట్లు హెచ్ఎం హుసేనయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యా కమిటీ చైర్మన్ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నామని, 23మంది కమిటీ సభ్యులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

హమాలీలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న బీసీ రాజారెడ్డి

బనగానపల్లె, సెప్టెంబరు 15: సమాజంలో అట్టడుగు వర్గాలైన హమాలీల పట్ల మంత్రి బీసీ సోదరులు, పట్టణ మాజీ సర్పంచ్ రాజారెడ్డి మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఆదివారం బనగానపల్లె పట్టణానికి చెందిన హమాలీ కార్మికులకు రూ.లక్ష విలువ చేసే దుస్తులను అందించారు. ఈ సందర్భంగా బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ సమాజంలో నిరంతరం శ్రమ చేసే కార్మికులను గౌరవించాలని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

సీఐలకు సన్మానం



సీఐలను సన్మానించిన గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

బనగానపల్లె, సెప్టెంబరు 15: గణేశ్ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా క్రమశిక్షణగా ఉన్న సిబ్బందితోనే ఉత్సవాలను విజయవంతం చేయడానికి సహకరించిన బనగానపల్లె మండల రూరల్, టౌన్ సీఐలు మంజునాధరెడ్డి, కృష్ణయ్యయాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గణేశ్ ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారులు టంగుటూరి శీనయ్య, అధ్యక్షులు మల్లారెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని రూరల్ సర్కిల్ పోలీసుస్టేషన్‌లో రూరల్ సీఐ మంజునాధరెడి, టౌన్ సీఐ క్రిష్ణయ్యయాదవ్‌లకు గణేశ్ ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారులు టంగు టూరి శీనయ్య, అధ్యక్షులు మల్లారెడ్డి, లాయర్ నాగేంద్రరెడ్డి, టీచర్ నాగరాజు, కమిటీ సభ్యులు కలిసి శాలువ కప్పి సన్మానించారు.

మంత్రి బీసీకి కృతజ్ఞతలు: రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధనరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని గణేశ్ ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారులు టంగుటూరి శీనయ్య, అధ్యక్షుడు మల్లారెడ్డిలు పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారుల సహకారం మరువలేనిదన్నారు. జీఎఫ్‌వో కమిటీ వారు మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో వారికి బహుమతి కూడా అందించారు. అనంతరం టంగుటూరి శీనయ్య, మల్లారెడ్డి టీచర్ నాగరాజులకు శాలువతో సన్మానించారు.

పంటకు చీర కంచె



పంట పొలాలకు కంచెగా ఏర్పాటు చేసిన చీరలు

రుద్రవరం, సెప్టెంబరు 15: రైతులు వన్యప్రాణుల నుంచి పంటలను రక్షించుకునేందుకు చీర కంచె ఏర్పాటు చేశారు. రుద్రవరం, కొండమాయపల్లె, వెలగలపల్లె, కోటకొండ ఇంకా పలు గ్రామాల్లో రైతులు పంట పొలాలకు రక్షణగా చీరలను కంచెగా ఏర్పాటు చేశారు. దీంతో ఆ వన్యప్రాణులు, అడవి పందులు పంట పొలాలపై దాడి చేయడంలేదని రైతులు తెలిపారు.

ముళ్ల బాట

● రోడ్డును కప్పేసిన కంప చెట్లు ● పట్టించుకోని అధికారులు



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన కంప చెట్లు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: మండలంలోని చింతలాయపల్లె - ఉమ్మాయిపల్లె గ్రామ ప్రధాన రహదారి ముళ్ల బాటగా మారింది. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఏపుగా పెరిగి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అబ్దులాపురం, కోరుమానుపల్లె గ్రామ సమీపంలో కంప చెట్లు రోడ్డుకు అడ్డంగా మారాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించక పోవడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ఉన్న కంపచెట్లను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గ్రామాల్లో పందుల బెడద

» పంట పొలాలపై దాడులు

» ఆందోళనలో రైతులు, ప్రజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 15: గ్రామాల్లో పందుల బెడద రోజురోజుకు అధికమవుతోంది. వీధుల్లో తిరుగుతూ అపరిశుభ్రతకు కారణమవుతుండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన కొలిమిగుండ్లతో పాటు, బెలుం, కనకాద్రిపల్లె తదితర అనేక గ్రామాల్లో పందుల బెడద తీవ్రంగా మారింది. గ్రామ పరిసరాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలను పందులు నాశనం చేస్తుండటంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కలందొడ్డిలో ఉన్న పశువుల మేత, వాములను సైతం పందులను నాశనం చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం కొలిమిగుండ్లలో మొక్కజొన్న, ఆముదం తదితర పంటలను పందులు నాశనం చేశాయి. గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు ప్రజల రోగాలకు కారణం కావడంతో పాటు, విధుల్లో చిన్న పిల్లలపై దాడికి తెగబడుతున్నాయని వాపోతున్నారు. పందుల బెడద నుంచి తప్పించాలని ప్రజలు, రైతులు అధికారుల దృష్టికి తీసుకవెళ్లినా ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పందుల బారి నుంచి కాపాడాలని కొలిమిగుండ్ల మండల ప్రజలు కోరుతున్నారు.



విచ్చలవిడిగా తిరుగుతున్న పందులు